
క్లుప్తంగా

గురజాల సీఐగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



గురజాల : గురజాల పోలీస్ స్టేషన్‌లో సీఐ దాసరి ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన దాసరి ప్రసాద్ ప్రకాశం జిల్లా గిద్దలూరు సీఐగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా గురజాలకు వచ్చారు. ఇప్పటివరకు గురజాల సీఐగా విధులు నిర్వహించిన టి.బాలకృష్ణ డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయడం జరిగింది. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దాసరి ప్రసాద్‌ను స్టేషన్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

నడికుడిలో వైద్య శిబిరం



దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని నడికుడి 17వ వార్డులో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వార్డులో ఎక్కువగా విషజ్వరాల బారినపడి ప్రజలు అల్లాడిపోతున్నారు. దీంతో వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్య సేవలు అందించారు. డాక్టర్ ఇమ్మడిశెట్టి అమూల్య ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది జ్వర బాధితులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇచ్చారు. కీళ్ల, కాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి కూడా వైద్య సేవలు అందించారు. ఈ శిబిరాన్ని కౌన్సిలర్ వేల్పుల ఏసమ్మ పర్యవేక్షించారు.

ఏసు మార్గంలో నడవాలి



మాచర్ల : పట్టణంలోని 22వ వార్డులో బేతేల్ మందిరం పాస్టర్ జాన్ వెస్లి ఆధ్వర్యంలో 40 రోజుల ఉపవాస ప్రార్థనలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం పాస్టర్ జాన్ వెస్లి మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడిచి ముందుకు వెళ్లాలన్నారు. ప్రతి ఒక్కరితో ప్రేమ, దయాగుణాలు కలిగి ఉండాలన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసు బోధనలు భక్తులకు వివరించారు. భక్తులకు అల్పాహారం అందించారు.

వడ్డెర కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన



మాచర్ల : పట్టణంలోని కోదండరామాలయంలో వడ్డెర కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెరల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. అందులో భాగంగానే ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. రాబోయే రోజుల్లో వడ్డెరలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు. పాతమాచర్లలోని వెంకటేశ్వరస్వామి, సీతారామయ్య దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దుర్గారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వాసవి అమ్మవారి దేవస్థానం చైర్మన్‌గా కట్టమూరి



రెంటచింతల: ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్‌గా మండల కేంద్రమైన రెంటచింతలకు చెందిన కట్టమూరి వెంకట నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆర్యవైశ్య సంఘం పెద్దలు బుధవారం తెలిపారు. రెండు సంవత్సరాలుగా దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తున్న వెంకట నాగేశ్వరరావును వరుసగా 3వ సంవత్సరం కూడా చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. కార్యదర్శిగా నాళం చినబాబు, కోశాధికారిగా దేవరశెట్టి వెంకట నరసయ్యలను ఎన్నుకున్నట్లు తెలిపారు. వరుసగా మూడో ఏడాదీ వాసవి అమ్మవారికి, భక్తులకు సేవ చేసే భాగ్యం భగవంతుడు తనకు ఇచ్చిన వరంగా భావిస్తానని చైర్మన్ వెంకట నాగేశ్వరరావు తెలిపారు.

కారెంపూడి ఎస్ఐగా వాసు

కారెంపూడి: కారెంపూడి ఎస్ఐగా ఎం.వాసు బుధవారం సాయంత్రం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లాలో పని చేస్తున్న వాసు బదిలీపై కారెంపూడి ఎస్ఐగా వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ వాసును మాజీ ఎంపీపీ కొంగర లక్ష్మీనారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, చప్పిడి రాము తదితరులు కలసి అభినందనలు తెలిపారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ అమీర్‌ను ఎక్కడకు బదిలీ చేశారనేది తెలియాల్సి ఉంది.

దాచేపల్లిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ





హర్ ఘర్ తిరంగా ర్యాలీని దాచేపల్లిలో బుధవారం చేపట్టారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక బీజేపీ నాయకులు, ఆర్యవైశ్య సంఘం నేతలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. హైస్కూల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ సెంటర్ మీదుగా నారాయణపురం ఆర్ అండ్ బీ బంగ్లా వరకు కొనసాగింది. –దాచేపల్లి

ముువ్వన్నెల రెపరెపలు



విద్యార్థుల్లో జాతీయ భావం పెంపొందించాలని తహసీల్దార్ మధుబాబు అన్నారు. పట్టణంలో బీజేపీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతనబోయిన హనుమంతరావు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహసీల్దార్ మధుబాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆరే వెంకటేశ్వర్లు, వడ్లమూడి వెంకయ్య, కొట్నీష్, వెంకట రామిరెడ్డి, నరసింహమూర్తి మల్లిఖార్జునరావు తదితరులు ఉన్నారు. –పిడుగురాళ్ల

ఒప్పిచర్ల ఇన్‌చార్జి సర్పంచ్‌గా పుష్పలత



కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్‌గా గంగనపల్లి పుష్పలత బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు పుష్పలతచే గ్రామ కార్యదర్శి బూతేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ కె.కసిన్యానాయక్ ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రస్తుత సర్పంచ్ రామదేని లక్ష్మి అనారోగ్య కారణాలతో సెలవు పెట్టడం, ఉప సర్పంచ్ ఇరికెదిండ్ల రమణ రాజీనామా చేయడంతో గ్రామ సర్పంచ్‌గా పుష్పలత బాధ్యతలను స్వీకరించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

- ముగిసిన సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ తరగతులు

రెంటచింతల: క్షేత్ర స్థాయి అధికారులు, గ్రామాల సర్పంచ్‌లతో పాటు ప్రజా ప్రతినిధుల సమష్టి కృషితోనే గ్రామాలలో అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు పంచాయతీ రాజ్ శిక్షణ సంస్థ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన మూడు రోజుల శిక్షణ తరగతులలో మూడో రోజు నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామాలలో మౌలిక వసతులు ఏర్పాటుకు, గ్రామస్తులకు మెరుగైన సేవలు అందించేందుకు సర్పంచ్‌లు, కార్యదర్శులు వారి విధులు, బాధ్యతలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 2024–25కు సంబంధించి బెస్ట్ పంచాయతీలుగా 4 గ్రామ పంచాయతీలను ఎంపిక చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఐఆర్ డీపీఆర్ అబ్జర్వర్ డా. కె.మోహన్‌రావు, సర్పంచ్ మున్నా చంద్రం, కార్యదర్శులు వెంకయ్య, సుబ్బారావు, నారాయణ, శౌరికుమారి, శిక్షణ టీవోటీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులతో ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ

గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది

వెల్దుర్తి : గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని మహానేతలు చెప్పిన మాటలను నిజం చేయాలంటే స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లదే కీలకపాత్ర అని ఎంపీడీవో డి.ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అలుగుమల్లి సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన 3వ రోజు శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు గ్రామాభివృద్ధిపై పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ముఖ్యంగా గ్రామాలలో పారిశుద్ధ్య పనులు, వీధి లైట్లు, రోడ్లు, తాగునీరు వంటి పనులపై దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో కూడా ప్రజల భాగస్వామ్యంతో తడి, పొడి చెత్తలను సేకరించి వర్మీ కంపోస్టు తయారు చేసి రైతులకు సబ్సిడీపై అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు కళ్లం రామాంజినేయరెడ్డి, ఈవోపీఆర్‌డీ మకట్‌లాల్, సర్పంచ్‌లు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లతో ఎంపీడీవో ప్రసాద్

గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులదే కీలక పాత్ర

మాచర్లరూరల్ : గ్రామాల అభివృద్ధిలో స్థానిక ప్రజాప్రతినిధులదే కీలక బాధ్యత అని, ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా పనిచేసే వారి ప్రవర్తనపైనే అభివృద్ధి ఆధారపడి ఉంటుందని ఎంపీడీవో కె.సరోజినీదేవి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సంఘం నిధులను పక్కా ప్రణాళికలు రూపొందించుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని, గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కీలకపాత్ర పోషించి గ్రామాభివృద్ధిలో ముందుకుపోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధిపై అవగాహన కలిగిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు, సర్పంచ్‌లు ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, శ్రీనునాయక్, బాబు, కొర్రయ్య, బ్రహ్మానాయుడు, పంచాయతీ కార్యదర్శులు ఎల్లబోయిన కోటేశ్వరరావు, ఆవుల వెంకటరామయ్య, బిట్టు వెంకటేశ్వర్లు, దస్తగిరి, సత్యనారాయణ, రమణ, బాబులనాయక్, నరేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల అభివృద్ధిపై అవగాహన ర్యాలీలో ఎంపీడీవో కె.సరోజినీదేవి తదితరులు

విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం

విజిలెన్స్ ఈఈ కె.సూర్య ప్రకాష్

రెంటచింతల: విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత విద్యుత్ చట్టానికి లోబడి ఉంటాయని ఇందులో భాగంగా విద్యుత్ చౌర్యం చేయడం చట్టరీత్యా నేరమని విజిలెన్స్ ఈఈ కె.సూర్య ప్రకాష్, ఆపరేషన్ ఈఈ జె.హరిబాబు అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామాజిక నేరమన్నారు. విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో రెంటచింతల సెక్షన్‌లో మల్లవరం, మంచికల్లు, పాలువాయి, పశర్లపాడు, సత్రశాల, తుమ్మకోట, గోలి గ్రామాలలో 4,956 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేయడం జరిగిందన్నారు. మీటర్ లేకుండా, మీటర్ ఉన్నా అక్రమంగా విద్యుత్ చౌర్యం చేస్తున్న, అనుమతించిన లోడ్ కంటే అదనంగా వాడుతున్న, వాడకం కంటే బిల్లు తక్కువగా ఇవ్వబడిన సర్వీసులను గుర్తించి మొత్తం 100 మందిపై రూ.5.94 లక్షల అపరాధ రుసుం విధించినట్లు వారు తెలిపారు. ఈ తనిఖీలలో 51 మంది అధికారులు, 185 మంది సిబ్బంది 51 బృందాలుగా ఏర్పడి సర్వీసులను తనిఖీ చేయడం జరిగిందన్నారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులకు 9440812263, 9440812360, 9440812361 నంబర్లను సంప్రదించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయన్నారు. ఈ దాడులలో డీఈఈలు ఎం.రవి కుమార్, కె.రవి కుమార్, టి.వీరేశ్వరరావు, ఏఈలు ఎస్‌కే మస్తాన్‌వలి, ఎ.చంద్రశేఖర్, ఆపరేషన్ డీఈ, ఏఈలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఈ రవికుమార్

నిత్యావసర సరుకులను బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు

రెంటచింతల: ప్రభుత్వం రేషన్ కార్డు లబ్ధిదారులకు అందజేస్తున్న నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయకుండా బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జి.కరుణ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో సెలవుపై వెళ్లిన రేషన్ డీలర్ల స్థానంలో నూతనంగా నియమింపబడిన ఇన్‌చార్జులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి రేషన్ సరుకులను అందజేయాలన్నారు. సరుకుల స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు స్థానిక కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు. సరుకులు పంపిణీ చేయడం లేదని లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు వచ్చిన డీలర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, ఆర్ఐ దాసరి కాంతారావు, వీఆర్వోలు, ఇన్‌చార్జి డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ జి.కరుణ కుమార్

బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండా ర్యాలీ

మాచర్ల : కుల, మతాలకతీతంగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో 1500 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. భారీ సంఖ్యలో పాఠశాలల విద్యార్థులు పాల్గొని వందేమాతరం, జై భారత్ అంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పార్కు సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్, తహసీల్దారు, ఎంపీడీవోలు, అధికారులు, మెప్మా ప్రాజెక్టు అధికారులు, ఆయా విభాగాలకు చెందిన సిబ్బంది, బీజేపీ పట్టణ అధ్యక్షుడు క్రాంతి, జిల్లా నాయకుడు కాశిపతి, సురేష్, రాష్ట్ర నాయకులు కె.వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

వైఎస్సార్‌సీపీ నాయకులను పరామర్శించిన కాసు

పిడుగురాళ్ల: పట్టణంలోని పల్నాడు హాస్పిటల్‌లో గాయాలై చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులను గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పరామర్శించారు. పట్టణానికి చెందిన 14వ వార్డు కౌన్సిలర్ పులి బాలకాశీ బైక్‌పై వస్తూ ప్రమాదానికి గురి కావటంతో అతనిని పరామర్శించారు. అనంతరం మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన యరవెద చిన్న రామిరెడ్డిని పరామర్శించి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, అధైర్య పడాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



14వ వార్డు కౌన్సిలర్ పులి బాలకాశీని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తా

ఎస్ఐ సీహెచ్ నాగార్జున



రెంటచింతల: మండల పరిధిలోని వివిధ గ్రామాలలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్ఐ చెంగా నాగార్జున అన్నారు. బుధవారం రెంటచింతల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన నాగార్జున విలేకర్లతో మాట్లాడుతూ చట్టం దృష్టిలో అందరూ సమానమేనన్నారు. గ్రామాలలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణ మద్యం సరఫరా చేసినా, విక్రయించినా నేరమన్నారు. గ్రామాలలో ప్రశాంత వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. గుంటూరు జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(డీసీఆర్‌బీ)లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ నాగార్జునను రెంటచింతల ఎస్ఐగా నియమిస్తూ పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు రెంటచింతల ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎం.ఆంజనేయులు 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై వచ్చారు.

బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలి

విజయపురిసౌత్: బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ లీలావతి అన్నారు. మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా స్థానిక డాక్టర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలకు ఉన్న చట్టాలు, ఆరోగ్య సూత్రాలు, పోషకాహారంపై విద్యార్థినులకు సూచనలు సలహాలు అందజేశారు. ఆడపిల్లలను రక్షించి చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మేరీ మంజుల, అంగన్‌వాడీ కార్యకర్తలు మాధవీలత, కనకరత్నం, శివలక్ష్మి, దుర్గ, ఉపాధ్యాయులు చెంచులక్ష్మి, అరుణకుమారి, లక్ష్మీజ్యోతి, అనూష, లత, మహిళా కానిస్టేబుల్ సుజాత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ లీలావతి

స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభం



మాచర్లరూరల్ : వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించటం అభినందనీయమని హెచ్ఎం రామిరెడ్డి విజయకుమారి అన్నారు. బుధవారం మండలంలోని కంభంపాడు జెడ్పీ హైస్కూల్‌లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ యూనిట్ విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమని అన్నారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు పి.రాఘవయ్య తాడికొండ సైనిక్ స్కూల్‌లో ట్రెనింగ్ పూర్తి చేసుకొని విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ముందుకు రావటం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

ఒప్పిచర్లలో మరో నాలుగు డయేరియా కేసులు

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో బుధవారం మరో నాలుగు డయేరియా కేసులు పీహెచ్‌సీకి వచ్చాయి. వారిలో బత్తుల కోటమ్మ, బత్తుల రాజేశ్వరికి వాంతులు విరేచనాలు ఎక్కువగా అవుతుండడంతో నరసరావుపేట జిల్లా హాస్పిటల్‌కు తరలించారు. మిగిలిన ఇద్దరికి పీహెచ్‌సీలోనే వైద్య సేవలందిస్తున్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే గ్రామంలో వైద్య శిబిరాన్ని డాక్టర్ ఎం.రమ్య కొనసాగించారు. రాత్రి పూట కూడా వైద్య శిబిరంలో సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. గ్రామంలోని పాత ఎస్సీ కాలనీ బోరు నీరు కలుషితంగా ఉందని నైట్రేట్స్ ఎక్కువగా ఉన్నాయని తేలింది. గ్రామంలో దోమల ఉధృతి ఎక్కువగా ఉందని ముఖ్యంగా గ్రామం మధ్యగా పారుతున్న ఇసుకవాగు పరిసర ప్రాంతాలలో దోమలు ఎక్కువగా ఉన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరకు గ్రామంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఫ్యాన్లు తిరుగుతున్నా దోమలతో వైద్య సిబ్బందే ఇబ్బందులు పడుతున్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లే కీలకం

గురజాల : గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లే కీలకంగా ఉంటారని ఎంపీడీవో ఆర్ ఫణికుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో మూడు రోజుల శిక్షణ తరగతులలో చివరి రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో వీధి దీపాల నిర్వహణ, కరెంటు చార్జీల చెల్లింపులు, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగం చేయడం వంటి వాటి గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

మాచర్ల : ఎయిడ్స్ మహమ్మారిని పారదోలేందుకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు అందరూ ముందుకు రావాలని ఎయిడ్స్ నిర్మూలన ప్రాజెక్టు మేనేజర్‌లు ఎం.కోమలి, శ్రీనివాసరావు అన్నారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో చక్రదాస్ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ కుర్రి సాయిమార్కెండేయరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేధింపులుంటే నేరుగా సంప్రదించండి



కారెంపూడి: ఎవరైనా వేధింపులకు గురి చేస్తున్నా, మెనూ ప్రకారం ఆహారం పెట్టకున్నా నేరుగా తమకు ఫోన్ చేయాలని గురజాల కోర్టు సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి కె.వీరవెంకట సత్యనారాయణ విద్యార్థులకు పిలుపునిచ్చారు. హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక కేజీబీవీని జడ్జిలు బుధవారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, ఇతర సౌకర్యాల లేమిని గుర్తించారు. ఇలాంటి సమస్యలుంటే నేరుగా ఫోన్ చేయాలని నంబర్లు ఇచ్చారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి సమస్యలను పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. మోడల్ స్కూల్‌లో జరిగిన ఘటన ఎక్కడా చోటుచేసుకోకూడదన్నారు. అంతకు ముందు తండాలో జరిగిన న్యాయ అవగాహనా సదస్సులో బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని అవగాహన కల్పించారు. సీనియర్ న్యాయవాది కొంగర హరి సత్యనారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భవిత సెంటర్‌ను సందర్శించి దివ్యాంగ విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ అమీర్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

నవీన్‌కు ఉత్తమ బాలఉపాధ్యాయ అవార్డు

వెల్దుర్తి : పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, మండాది గ్రామానికి చెందిన కార్ప్ సంస్థ బాలబాట డెవలప్‌మెంట్ ఆర్గనైజర్ పేరుపోగు నవీన్ ఉత్తమ బాల ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావటం సంతోషకరమని కార్ప్ సంస్థ బాలబాట డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్‌నాథ్ అన్నారు. బుధవారం గుంటూరులోని సంతోష్‌నగర్ ఆర్నాల్డ్ పౌలస్ ఆడిటోరియంలో కార్ప్ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ బాల ఉపాధ్యాయ అవార్డును పేరుపోగు నవీన్ అందుకోవటం సంతోషకరమన్నారు. పేద పిల్లలను గురుకుల పాఠశాలలో చేర్పించినందుకు ఈ అవార్డు దక్కిందన్నారు. ఈ అవార్డు ఇచ్చినందుకు కార్ప్ సంస్థకు నవీన్ కృతజ్ఞతలు తెలిపారు.